మున్సిపాలిటీ నిర్వహణ ఎలా..?

- ఆస్తి, కుళాయి పన్నుల బకాయిలపై దృష్టి సారించిన అధికారులు
- అదనపు నిర్మాణాలను గుర్తించి వాటిపై పన్ను మోత
- పెండింగ్‌లో ఉన్న రూ.7 కోట్ల ప్రభుత్వ ఆస్తుల పన్నులు



మున్సిపల్ కార్యాలయం

నరసరావుపేట: పట్టణ ప్రజలు చెల్లించాల్సిన రూ.6 కోట్ల ఆస్తి, రూ.5.32 కోట్ల తాగునీటి పన్నుల కోసం పురపాలక సంఘ అధికారులు పట్టణంలో వేట మొదలు పెట్టారు. ఈ మేరకు మున్సిపల్, డిప్యూటీ, అసిస్టెంట్ ఇంజనీర్లు, రెవెన్యూ ఆఫీసర్, రెవెన్యూ ఇనస్పెక్టర్లను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. మున్సిపల్ రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులతో బృందాలను ఏర్పాటు చేశారు. వీరు ఇంటింటికి తిరుగుతూ ఆస్తి పన్నులు చెల్లించని వారిని గుర్తించి హెచ్చరించి వసూలు చేయటం, ఇప్పటివరకు పన్నులు వేయని అదనపు నిర్మాణాలను గుర్తించి పన్నులు వేయటం వీరి విధి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పన్నులు తగ్గిస్తామని, వేధించటం జరగదంటూ విస్తృత ప్రచారం చేసిన కూటమి నేతలు అధికారంలోకి రాగానే వివిధ కారణాలతో పన్నులు చెల్లించ లేని వారిపైకి అధికారులను బాణాలుగా వదిలారు. అయితే ప్రభుత్వ భవనాల ద్వారా పురపాలక సంఘానికి చెందాల్సిన సుమారు రూ.7 కోట్ల పన్నులు పెండింగ్‌లో ఉన్నా వాటి గురించి మాత్రం పట్టించుకోకపోవటం గమనార్హం.

పట్టణంలో పన్నులు ఇలా...

పట్టణ పరిధిలోని 38 వార్డుల్లో సుమారు 33,646 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి ఏడాది రూ.13 కోట్ల ఆస్తి పన్నులు, రూ.4.32 కోట్ల కుళాయి పన్నులు వసూలు కావాల్సి ఉంది. గతేడాది ఆస్తి పన్నులో 85 శాతం పన్నుదారులు చెల్లించారు. కుళాయి పన్నుల్లో రూ.2.32 కోట్లు వసూలు కాగా మరో రూ.2 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మొత్తం కుళాయి పన్నులు రూ.3.57 కోట్లు వసూలు కావాల్సి ఉంది. దీనిపై ఈ ఏడాది ప్రజల నుంచి విస్తృతంగా పన్ను వసూళ్లపై దృష్టి పెట్టాలని మున్సిపల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ, సచివాలయ కార్యదర్శులతో స్థానిక అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించి బృందాలను ఏర్పాటు చేసి లక్ష్యాలను నిర్దేశించారు.

రాని ప్రణాళిక నిధులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పురపాలక సంఘానికి నిధుల విడుదల కరువైంది. పురపాలక సంఘానికి ఎన్నికలు జరగకుండా ప్రతిపక్షంలో ఉండగా టీడీపీ నాయకులు కోర్టు ద్వారా అడ్డుకున్నారు. దీని వలన ఎన్నికలు జరగకపోవటంతో కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి ఏడాది అందాల్సిన ప్రణాళిక నిధులు (ఫైనాన్స్) ఆగిపోయాయి. ఇవి సుమారు రూ.6 కోట్ల వరకు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏవిధంగాను స్థానిక సంస్థలకు నిధులు సమకూరే పరిస్థితులు లేకపోవటంతో మీరే పన్నులు వసూలు చేసుకొని పురపాలక సంఘాన్ని నిర్వహించుకోవాలంటూ పై అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. పన్నులు చెల్లించకపోతే కోర్టులను ఆశ్రయించి ఆయా ఆస్తులను జప్తు చేయించి తగిన జరిమానాలతో వసూలు చేయాలనే ఆదేశాలు కూడా అధికారులు అందుకున్నారు.

పన్ను బకాయిలపై దృష్టి



పురపాలక సంఘానికి పన్నులు చెల్లించి ప్రజలు సహకరించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగుల జీతాలు, నిర్వహణ కోసం పన్ను బకాయిలపై దృష్టి సారించాం. కొందరు అధికారులను నోడల్ ఆఫీసర్లుగా కమిషనర్ నియమించారు. అలాగే సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేశారు. సాధ్యమైనంత వరకు పన్నులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తాం.

– శ్రీనివాసరావు, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

జిల్లా కలెక్టర్ కృతికాశుక్ల



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కృతికాశుక్ల

వినుకొండ: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికాశుక్ల అన్నారు. బుధవారం వినుకొండ రూరల్ పరిధిలో విఠంరాజుపల్లి గ్రామం వివేకానంద బియిడి కళాశాలలో 2025 మెగా డీఎస్సీలో నూతనంగా నియామకం అయిన ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. తొలుత కలెక్టర్ కృతికాశుక్ల, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సావిత్రిబాయి పూలే, రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికాశుక్ల మాట్లాడుతూ నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన గ్రామాల్లో ఉండాలని పేద బలహీన వర్గాల విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన గుణాత్మక విద్యను బోధించాలన్నారు. విద్యారంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన కార్యక్రమాల పట్ల అవగాహన కల్గియుండాలన్నారు. శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న అంశాలను పాఠశాల తరగతి గదుల్లో విద్యార్థులకు బోధన రూపంలో అందించాలన్నారు. వినుకొండ, దుర్గి, గురజాల, బొల్లాపల్లి, వెల్దుర్తి తదితర ఏరియాల్లో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీలు ఉన్నాయని విధులు నిర్వహించటానికి సిద్ధంగా ఉండాలన్నారు. 182 మంది ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల్లో పాల్గొనగా ఈ నెల 10వ తేదీతో ముగియనున్నాయి. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, వినుకొండ కోర్సు డైరెక్టరు ఎంఈవో సయ్యద్ జఫ్రుల్లా, ప్రోగ్రాం ఇన్‌చార్జ్ మర్రి విజయభాస్కర్, ఆర్‌పీలు చంద్రశేఖర్, రఘురామ్, అంకిరెడ్డి, సీతారామయ్య, సాంబశివరావు ఉన్నారు.

వరి పంటలో వినూత్న పద్ధతులు ఆచరించాలి

జిల్లా ప్రాజెక్టు అధికారి అమలకుమారి



వరి పంట పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఈపూరు(శావల్యాపురం): వరి పంట సాగులో రైతులు వినూత్న పద్ధతులు ఆచరించాలని జిల్లా ప్రాజెక్టు మేనేజరు కె.అమలకుమారి అన్నారు. బుధవారం ఈపూరు గ్రామంలో దారా ప్రకాశరావు సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ వరి పంటలో వినూత్న పద్ధతులు రైతులు అలవరుచుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయు రైతులు తమ పొలాల్లో నాలుగు అడుగుల బెడ్స్ ఒక అడుగు పంట కాల్వ తయారి చేసి వరి పొలం 25 సెంటిమీటర్ల మధ్యలో ఆకుకూరలు, దుంపజాతులు సాగు చేయాలన్నారు. దీని ద్వారా రైతులకు అంతర పంటల ఆదాయం లభిస్తుందన్నారు.

అదనపు నీటి వినియోగం తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో రామినేని రామారావు, గ్రామ వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకులు సైదయ్య, మాస్టర్ ట్రైనర్స్ తిరుపతిరావు, భాస్కర్‌రావు, శివలక్ష్మి, ఆంజనేయులు రైతులు పాల్గొన్నారు.

18 నుంచి జనవిజ్ఞాన వేదిక చెకుముకి సంబరాలు



చెకుముకి సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

చిలకలూరిపేటటౌన్: జనవిజ్ఞాన వేదిక ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే చెకుముకి సంబరాలు ఈ నెల 18వ తేదీ శనివారం పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నట్టు స్థానిక డివిజన్ ప్రధాన కార్యదర్శి బి.అజయ్‌బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికలు(పోస్టర్) పట్టణంలోని రోటరీ హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పాఠశాల స్థాయిలో జరిగిన చెకుముకి పోటీల్లో చిలకలూరిపేట నియోజకవర్గంలో 7 వేల మంది పాల్గొన్నారని, ఈ ఏడాది ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ సంబరాల్లో పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు నవంబర్ 1వ తేదీన నిర్వహించే సంబరాల్లో బహుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రధాన ఉపాధ్యాయులు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అజయ్‌బాబు కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ధూళిపాళ వెంకట్రావు, ప్రచురణల కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దార్ల బుజ్జిబాబు, సాహితీవేత్తలు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, డాక్టర్ పీవీ సుబ్బారావు, డాక్టర్ చుక్క విన్సెంట్‌పాల్ తదితరులున్నారు.

క్లుప్తంగా

పట్టణ సీఐగా ప్రభాకరరావు బాధ్యతల స్వీకరణ



వినుకొండ: వినుకొండ పట్టణ సీఐగా బలగాని ప్రభాకరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన సీఐ శోభన్‌బాబు సాధారణ బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా ఒంగోలు పీటీసీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వినుకొండ రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ప్రభాకరరావు పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వినుకొండ పట్టణంలో శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటానని, ప్రజలందరు పోలీసులకు సహకరించాలన్నారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఎస్సైలు, పోలీసు సిబ్బంది పరిచయ కార్యక్రమంతో పూలమాలలతో ఘనంగా స్వాగతించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



నాదెండ్ల: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని ఎస్సై జి.పుల్లారావు చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు విక్రయించినా, రవాణా చేసినా, సేవించినా, ప్రేరేపించినా 100 నంబరుకు గానీ, ఉపాధ్యాయులకు గానీ సమాచారమివ్వాలని కోరారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదువుపై దృష్టి పెట్టి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మత్తు పదార్థాల వలన కలిగే ఆరోగ్య, మానసిక నష్టాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఐ.కృష్ణానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదో తరగతిలో సత్తాచాటాలి

విద్యాదాత నడికట్టు రామిరెడ్డి



నాదెండ్ల: ఓ వ్యక్తి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనం విద్యేనని విద్యాదాత నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. గతేడాది పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించటం, 11 మంది ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధించటం పాఠశాలకు గర్వకారణమన్నారు. రాష్ట్ర స్థాయిలో పాఠశాలకు పేరు వచ్చిందన్నారు. ఈ ఏడాది కూడా నూరు శాతం ఫలితాలతో సత్తా చాటాలన్నా రు. పదో తరగతిలో కష్టపడిన విద్యార్థులకు పై చదువులు సులభంగా ఉంటాయన్నారు. విద్య తో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. దేశ భవిష్యత్తుకు బలమైన పునాది విద్యార్థులేనన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యర్థాల సక్రమ నిర్వహణపై కృషి అభినందనీయం

చిలకలూరిపేట: వ్యర్థాల సక్రమ నిర్వహణపై అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమైనదని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. అసిస్ట్ సంస్థ కార్యాలయంలో ఘన, ద్రవ వ్యర్థాలకు సంబంధించిన ఐఈసీ(ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ అండ్ కన్వర్‌మేషన్ మెటీరియల్) పోస్టర్‌ను అసిస్ట్ నిర్వాహకులతో కలసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి లక్ష్యం స్వచ్ఛత, పరిశుభ్రత కావాలన్నారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జాష్టి రంగారావు, అసోసియేట్ డైరెక్టర్ జె.కృష్ణహరీష్, కో ఆర్డినేటర్లు రత్నకుమార్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలకు అంతరాయం

శావల్యాపురం: స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు) సేవలు కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ అనుసంధానం జరుగుతుందని బ్రాంచ్ మేనేజరు వలేటి శివకృష్ణ బుధవారం తెలిపారు. ఈ కారణంగా 9వ తేదీ సాయంత్రం నుంచి ఈ నెల 13 వరకు అన్ని ఆర్థిక పరమైన బ్యాంకింగ్ సేవలు, ఆన్‌లైన్ లావాదేవీలు, యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏఈపీఎస్ తదితర సేవలు అందుబాటులో ఉండవని, ఖాతాదారులు అసౌకర్యాన్ని గమనించి బ్యాంకు సిబ్బందికి సహకరించాలన్నారు.

వేర్వేరు చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలతో కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరణ్, ఎస్సై వంశీకృష్ణ, సిబ్బంది

నరసరావుపేట టౌన్: రెండు వేర్వేరు చోరీ కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ ఎం.వి.చరణ్ తెలిపారు. బుధవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. రామిరెడ్డిపేటకు చెందిన దాసరి ప్రణిత గృహంలో అమరారపు భూలక్ష్మి పనిమనిషిగా పనిచేస్తూ ఉంటుంది. ఈ ఏడాది ఆగస్టులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో భూలక్ష్మి పని చేసే గృహంలో బంగారు ఆభరణాలు దొంగిలించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామన్నారు. లభ్యమైన సాంకేతిక ఆధారాలతో నిందితురాలిని అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి చోరీ సొత్తు నక్లెస్, చైన్, లాకెట్, జత గాజులు, జత చెవిదిద్దులు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే విధంగా నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని జేబు దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడు షేక్ బాజీను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.40 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వంశీకృష్ణ, సిబ్బంది వీరాంజనేయులు, మురళి పాల్గొన్నారు.

12 నుంచి మాలాధారులకు భిక్ష

నాదెండ్ల: సాతులూరు రామాలయంలో ఈ నెల 12వ తేదీ నుంచి సాయంత్రం 7 గంటలకు అయ్యప్పస్వామి మాలాధారులకు భిక్ష ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అయ్యప్పస్వాములు, శివస్వాములు, భవానిస్వాములు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత రెండేళ్లుగా భిక్ష ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఆవులు, గేదెలు రోడ్లపై వదిలేయటం నేరం

మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు

నరసరావుపేట: పట్టణంలోని రోడ్లపై బహిరంగంగా ఆవులు, గేదెలు వదిలేయటం నేరమని, అటువంటి యజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆవులు, గేదెల వలన పరిశుభ్రత, పారిశుద్ధ్యంకు విఘాతం కలగటంతో పాటు ప్రజా రవాణాకు భంగం కలుగుతుందన్నారు. యజమానులు వాటిని ప్రత్యేక వాతావరణంలో పెంచాలని, ఈ మేరకు సచివాలయ కార్యదర్శుల ద్వారా యజమానులకు నోటీసులు అందజేయటం జరిగిందన్నారు. లేనిపక్షంలో యజమానులకు తెలియజేయకుండానే జనావాసాలకు దూరంగా తరలించటం, యజమానులపై భారీగా జరిమానా విధించటం జరుగుతుందని హెచ్చరించారు.

అక్టోబర్ 25 వరకు ఈ క్రాప్ నమోదుకు గడుపు పెంపు

అచ్చంపేట: మండలంలో ఈ క్రాప్ నమోదుకు అక్టోబరు 25వరకు గడుపు పెంచినట్లు ఏవో పి.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. అచ్చంపేట మండలంలో 22వేల ఎకరాలలో సాగు విస్తీర్ణం ఉండగా 19,250 ఎకరాలలో రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 17వేల ఎకరాల పంటలను తమ సిబ్బంది ఈ క్రాప్ నమోదు చేశారన్నారు. పంట నమోదు చేయించుకోవలసిన రైతులు సమీప రైతు సేవా కేంద్రానికి వెళ్లి నమోదు చేయించుకోవాలని సూచించారు. పంటలకు అనువుగాని భూములు, ఖాళీగా ఉన్న భూములను కూడా ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కి సాగు చేయని భూములుగా పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు పండించిన పంటలు ప్రభుత్వం కొనుగోలు చేయాలంటే పంటనమోదు తప్పని సరిగా చేయించి ఉండాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టం జరిగితే పరిహారం పొందాలన్నా పంటనమోదు ప్రక్రియ ముఖ్యమన్నారు. కౌలు దారులకు రుణ అర్హత పత్రాలను కూడా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అవసరమైన రైతులు వీఆర్వో, సమీప రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయా లైన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు వద్ద బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామానికి చెందిన కారసాని ప్రమోద్ సత్తెనపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై కంటెపూడి వెళుతుండగా నందిగామ అడ్డరోడ్డు వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో గుంటూరు నుంచి సత్తెనపల్లి వస్తు న్న విద్యుత్ శాఖకు చెందిన బొల్లేరో వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో ప్రమోదుకు తీవ్ర గాయాలు కావడంతో హుటా హుటిన సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఎంఈవో సాంబశివరావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో సాంబశివరావు



నూజెండ్లలో ఉత్కంఠ భరితంగా కబడ్డీ పోటీ

శావల్యాపురం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. బుధవారం మండలంలోని పొట్లూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి 2025 విద్యా సంవత్సరం స్కూల్ గేమ్స్ టోర్నమెంటు సెలక్షన్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడాల్లో రాణించిన విద్యార్థులకు ప్రత్యేకంగా గుర్తింపుతో పాటు రాయితీలు వర్తిస్తాయన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. అనంతరం క్రీడాకారులు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొనగా వాలీబాల్, కబడ్డీ, బాడ్మింటన్, చెస్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 పుసులూరి లలితకుమారి, ప్రధానోపాధ్యాయులు సింగంశెట్టి అన్నపూర్ణమ్మ, విన్సెంట్, ఫిలోమీనా, మురళీకృష్ణ, స్కూల్ గేమ్స్ మండల కో ఆర్డినేటర్ బి.అనురాధ, సర్పంచ్ పోపూరి జ్యోతి, విద్యా కమిటీ చైర్మన్ చింతా సైదారామారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి: ఎంపీడీవో

నూజెండ్ల: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీడీవో పి.ఉమాదేవి సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో జరుగుతున్న ఆటల పోటీలు నూజెండ్ల జెడ్పీ పాఠశాలలో బుధవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో ఉమాదేవి, ఎంఈవోలు సత్యనారాయణ, రవిచంద్ర పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు బి.శ్రీదేవి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీడీవో మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తితో ఆటల పోటీలు సాగాలని కోరారు. స్కూల్ గేమ్స్ మండల కో ఆర్డినేటర్ పి.డి.వెంకటరత్నం మాట్లాడుతూ నూజెండ్ల, కంభంపాడు, మోడల్ పాఠశాల, ఉప్పలపాడు గురుకుల పాఠశాల, నాగిరెడ్డిపల్లె, సీతారాముపురం, కేజీబీవీ పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు ఈ ఆటల పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నరసరావుపేట రూరల్: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని డిప్యూటీ డీఈవో సుభాని తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఎంపిక పోటీలు రెండవ రోజు కొనసాగాయి. మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన పోటీలను డిప్యూటీ డీఈవో సుభాని ప్రారంభించారు. పోటీలలో భాగంగా వాలీబాల్, డిస్కస్‌త్రో, జావెలెన్‌త్రో పోటీలను నిర్వహించారు. అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లోలో 20 జట్లకు పైగా పాల్గొన్నాయి. ప్రతిభ చాటిన క్రీడాకారులను మండల స్థాయి జట్టుకు ఎంపిక చేశారు. గురువారం బ్యాడ్మింటన్ పోటీలను రావిపాడు రోడ్డులోని బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్నట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్ తెలిపారు. పోటీలను మహిళా కార్యదర్శి డాక్టర్ ఉన్నం పద్మావతి, జి.ప్రసాద్, టీవీ భాస్కర్, ఇజ్రాయిల్ ప్రసాద్, కోటేశ్వరరావు, ఉమాదేవి, రమాదేవి, పి.అశోక్, రషీదా తదితరులు పర్యవేక్షించారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జరగనున్న మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సాఫ్ట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పి.నరసింహారెడ్డి, పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఉన్నం పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆడి క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల క్రీడాకారులకు మొదటి రోజున కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా వంటి పోటీలను నిర్వహించారు. మొదటి రోజు ఆటల పోటీలలో 225 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభానీ, వ్యాయామ ఉపాధ్యాయులు సైదయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎస్.రామకృష్ణారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ ఏడుకొండలు, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



అండర్-14 బాలుర వాలీబాల్ జట్టు



యోగాసనాల పోటీల్లో విద్యార్థినులు